Mana Telangana Date:- 21/04/2023



# మెట్రోకు పోటెత్తిన ప్రయాణికులు

## ఎండ తీవ్రతతో పెరుగుతున్న ఆదరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రోకు జనాలు పోటెత్తుతున్నారు. ప్రస్తుతం మెట్రోకు ఎప్పుడూ లేనంత ఆదరణ పెరుగుతోంది. ఎండల తీవ్రత పెరగడంతో నగరవాసులు మెట్రోరైలు ఎక్కడానికి క్యూ కడుతున్నారు. ఈ రద్దీని చూస్తుంటే ముంబై మెట్రోను తలపిస్తోంది. ఎండల తీవ్రత పెరగడంతో ప్రజలు మెట్రోలో ప్రయాణించడానికి మొగ్గు చూపడం విశేషం. దీంతో మెట్రో స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా ఎల్‌బినగర్, అమీర్‌పేట్, సికింద్రాబాద్ మెట్రోస్టేషన్‌లో ప్రయాణికులు బారులు తీరుతున్నారు. అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో గురువారం మధ్యాహ్నం ఇసుక వేస్తే రాలనంత జనం కనిపించారు. ప్లాట్‌ఫాంలు, ఎస్కలేటర్లు ఎక్కడ చూసినా జనసంద్రంతో నిండిపోయింది. వారం రోజులుగా రోజుకు నాలుగున్నర లక్షల మందికి పైగా మెట్రోలో ప్రయాణించినట్లుగా మెట్రో వర్గాలు తెలిపాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మెట్రో సర్వీసుల సంఖ్యను పెంచాలంటూ ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. నిజానికి హైదరాబాద్‌కు మెట్రో వచ్చిన తొలినాళ్లలో తీవ్ర నష్టాలను చవిచూసింది. అప్పట్లో ప్రయాణ ఖర్చులను ప్రయాణికులు భారంగా భావించేవారు. దీంతో సామాన్యులెవరూ మెట్రోజోలికి వెళ్లేవారు కాదు. ప్రస్తుతం తొందరగా గమ్యస్థానాలకు చేరుకుంటుండడం, వర్షాకాలం, ఎండాకాలం ప్రయాణాలకు సేఫ్ కావడంతో ప్రజలు ఈ రైలు ఎక్కడానికి ఆసక్తి చూపుతున్నారు.